30012025-MAI-04_Layout 1 1/30/2025 4:01 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఇస్రో సెంచరీ

భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) మరో కీలక మైలురాయి దాటింది. వందో రాకెట్ ప్రయోగం దిగ్విజయంగా జరిపి గగన వీధుల్లో భారత కీర్తి పతాకాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకుపోయింది. బుధవారం నాటి ప్రయోగానికి ఇదొక్కటే కాకుండా ఎన్నో ప్రత్యేకతలున్నాయి. నేవిగేషన్, ఎర్త్ అబ్జర్వేటరీ ఉపగ్రహాలను అది అంతరిక్షంలో సురక్షితంగా దిగబెట్టింది. జీఎస్ఎల్ వీ ఎఫ్-15 రాకెట్‌లో ఎన్వీఎస్ 02 కమ్యూనికేషన్స్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చారు. దీంతో భారత్ సొంత జీపీఎస్ వ్యవస్థ ఎంతగానో మెరుగుపడుతుంది. పైగా ఇటు రాకెట్, అటు ఉపగ్రహం రెండూ కూడా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైనవే. అంచెలంచెలుగా ఎదిగిన ఇస్రో ఇప్పటివరకు 548 ఉప గ్రహాలను కక్ష్యల్లోకి చేరవేసి రికార్డు సాధించింది. వాటి మొత్తం బరువు 120 టన్నులు. అందులో 433 విదేశీ ఉపగ్రహాలు కావడం గమనార్హం. వందమెట్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందని పెద్దలు చెప్పారు. 1962లో విక్రం సారాభాయ్ సిఫారసు మేరకు ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంతరిక్ష సంస్థను ఏర్పాటుచేశారు. అప్పట్లో దీని పేరు ఇన్కోస్పార్‌గా ఉండేది. 1969లో ఇస్రోగా పేరు మార్చారు. ఇస్రో రూపొందించిన తొలి ఉపగ్రహం ఆర్యభట్ట సోవియట్ రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళ్లింది.

అనంతర కాలంలో స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధికి కృషి జరిగింది. 1979లో బాలారిష్టాలు దాటి ఇస్రో సొంతంగా తొలి రాకెట్ ప్రయోగం జరిపింది. సారాభాయ్, సతీష్ ధవన్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహామహులు అంకితభావంతో జరిపిన అవిరళకృషితో ఇస్రో ఇంతింతై వటుడింతై అన్నట్టు పైపైకి ఎగిసింది. పేద దేశమైన భారత్‌కు రాకెట్ టెక్నాలజీ ఎందుకు అవసరమని ఈసడించినవాళ్లకు కండ్లు బైర్లు కమ్మేలా సమాధానం చెప్పగలిగాం. సైకిళ్ల మీద రాకెట్ విడిభాగాలు మోసుకెళ్లిన రోజుల నుంచి ఒకే విడతలో వందకు పైగా ఉపగ్రహాలను పంపించే స్థాయికి చేరుకున్నాం. అగ్రరాజ్యాల సరసన నగర్వంగా నిల బడగలిగాం. ఈ ప్రస్థానంలో సోవియట్ సహకారం మరువరానిది. 1984లో తొలి భారత వ్యోమగామి రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి అడుగుపెట్టింది సోవియట్ వ్యోమనౌకలోనే అనేది గుర్తుంచుకోవాలి.

ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష పరిజ్ఞానంలో స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోగలిగాం. చంద్రుని మీదకు అంగుల వేశాం. అంగారకుని మీదకు అధ్యయన యాత్రలు జరిపాం. సూర్యుని మీదకు దృష్టి సారించాం. మూడు చంద్రయాన్ మిషన్లు, మార్స్ ఆర్బిటర్ మిషన్, ఆదిత్య ఎల్-1 మిషన్.. ఇలా ప్రతిష్టాత్మకమైన ప్రయోగాలు పూర్తిచేసి, రాకెట్ రంగంలో మన స్థానా న్ని పదిలం చేసుకున్నాం. దేశ దేశాలు రాకెట్ ప్రయోగాల నిమిత్తం ఇస్రో ముందు క్యూ కడుతుండటమే ఇందుకు తార్కాణం. ఇస్రో చీఫ్ వి.నారాయణన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ వందో ప్రయోగం జరగడం విశేషం. ఇస్రో ఈ ప్రయోగాల పరంపర మరింత వేగంగా, సమర్థవంతంగా కొనసాగించబోతున్నది. వందో మైలురాయి దాటేందుకు 46 ఏండ్లు పడితే రాబోయే ఐదేండ్లలో మరో వంద ప్రయోగాలు చేపట్టనున్నట్టు ఇస్రో ప్రకటించడం దేశానికి గర్వ కారణం. జయహో ఇస్రో.. జయహో భారత్.

కమలం బాటలో కాంగ్రెస్

బుద్దా మురళి

'నువ్వు ఏ స్కూల్‌లో చదువుకున్నావో నేను ఆ స్కూల్ ప్రిన్సిపల్‌ను' అనే డైలాగ్ చాలా సినిమాల్లో ఉపయోగించారు. ఇటీవల కాంగ్రెస్ కొత్తగా మొదలుపెట్టిన దుష్ప్రచారం మాడల్ చూస్తే ఈ డైలాగ్ గుర్తుకువస్తుంది. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' కోసం బీజేపీ దేశవ్యాప్తంగా తీవ్రంగా కృషిచేసి బ్రహ్మాండమైన విజయం సాధించింది. బీజేపీ దుష్ప్రచార మాడల్‌ను ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ నమ్ముకున్నట్టుగా కనిపిస్తున్నది.

బీఆర్ఎస్ నాయకత్వంపై సామాజిక మాధ్యమాల్లో బురదజల్లే ప్రయత్నాలు శ్రుతి మించుతున్నాయి. సీఎం ప్రసంగాలు కూడా హాస్యాస్పదంగా ఉంటున్నాయి. రాజకీయ అవకాశాలు కలిసి వచ్చాయి తప్పితే జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రసంగించే పరిజ్ఞానం ఆయనకు లేదు. జాతీయ వేదికల మాట దేవుడెరుగు స్థానిక మీటింగ్‌లలోనూ విషయ పరిజ్ఞానం లేకుండా ప్రసంగించి నవ్వులపాలవుతున్నా రు. వికారాబాద్‌లో టీబీ చికిత్స గురించి మాట్లాడాల్సిన చోట కుష్ఠువ్యాధి గురించి మాట్లాడుతుంటే వేదికపై ఉన్నవారు లెప్రసీ కాదు.. టీబీ అని చెవిలో చెప్పాల్సి వచ్చింది. టి.అంజయ్య తెలంగాణ యాసలో మాట్లాడితే అప్పటి మీడియా ఆయన ఉపన్యాసాలను వెక్కిరించేది. సముద్రంలో తేలు పడింది అంటూ అంజయ్య మీద జోకులు పుట్టించారు. అప్పుడు ఎలక్ట్రానిక్ మీడియా లేదు, ప్రింట్ మీడియానే కాబట్టి తమ ఇష్టం ఉన్నట్టు జోకులు నిజాలుగా సృష్టించేవారు. ఇప్పుడు అలా కాదు. ఏ నాయకుడి మాట తీరు ఏమిటో? ఏ నాయకుడి విషయ పరిజ్ఞానం ఏమిటో ప్రజలు లైవ్‌లో చూస్తున్నారు. అయినా రాజకీయ పార్టీల అనుబంధాల వల్ల విషయ పరిజ్ఞానం లేకుండా నవ్వుల పాలయ్యే విధంగా ప్రసంగించినా మీడియా ఆ నాయకులను తెలివైన వారిగా ప్రజల మెదళ్లలో చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నది. కొన్ని నిజాలు మీడియాలో ప్రచారానికి నోచుకోకపోయినా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎవరేమిటో తెలుస్తున్నది. ఒకవైపు అనేక మీటింగ్‌లలో వక్తలు సీఎం పేరే మరిచిపోతున్నారు . మరోవైపు ఉపన్యాసాల్లో ఆయన డొల్లతనం బయటపడుతున్నది. దీంతో ప్రత్యర్థిపై దుష్ప్రచారం ద్వారా పరిస్థితిని చక్కదిద్దాలనే ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీనిలో భాగంగానే కేసీఆర్ అమెరికాకు వెళ్లిపోతున్నారని కాంగ్రెస్ ప్రాయోజిత ప్రచారం మొదలైంది. క్షుద్ర పూజలు అనే ప్రచారాన్ని కూడా ప్రారంభించారు.

ఇలాంటి ప్రచారంలో బీజేపీని అనుసరించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టుగా ఉన్నది. ప్రచారంలో బీజేపీ యూనివర్సిటీల స్థాయిలో ఉంటే కాంగ్రెస్ అక్ష

రాభ్యాసం స్థాయిలో ఉన్నది. బీజేపీ ప్రచారం ఒక్క ఆ పార్టీ ఐటీ విభాగం మాత్రమే కాదు హిందూ సంస్థలు, కుల సంఘాలు దశాబ్దాల నుంచి ఒక పథకం ప్రకారం దుష్ప్రచారం సాగిస్తున్నాయి. ఏ కుల సంఘం వాట్సాప్ గ్రూప్ చూసినా, చివరికి టీచర్ల వాట్సాప్ గ్రూపుల్లో సాగే ప్రచారం చూసినా 'కాంగ్రెస్ ముక్త్ భారత్' ఎంతో దూరంలో లేదనిపిస్తుంది.

ప్రముఖ సామాజిక మాధ్యమం 'కోరా'లో వృత్తి నిపుణులు, కవులు, రచయితలు, జర్నలిస్టులు అన్ని వృత్తుల వారుంటారు. ప్రశ్నలు, సమాధానాలు సమాచారం తెలిపే విధంగా ఉంటాయి. అందులో ఒక ఆసక్తి కరమైన సమాచారం చూశాను. పాస్టర్లు, నన్స్‌కు కాంగ్రెస్ 1944 నుంచి ఆదాయం పన్ను మినహాయించిందని. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దానిని తీసివేశారని విస్తృతంగా ప్రచారం జరిగింది. పాస్టర్లకు ఆదాయ పన్ను మినహాయించడం ఎలా సాధ్యం? ఒక వేళ అదే నిజమైతే రూ.కోట్ల పన్నులు ఎగ్గొట్టడానికి అందరూ పాస్టర్ అని క్లైమ్ చేసుకుంటారు. అదేమీ అఖిల భారతస్థాయి పరీక్ష కాదు, ఎవరన్నా పాస్టర్ కావచ్చు. ఎలా సాధ్యం? అని గూగుల్‌లో సెర్చ్ చేస్తే తెలిసింది. ఏ ఉద్యోగికైనా జీతం ఇస్తే టీడీఎస్ మినహాయించి ఇస్తారు. మద్రాస్‌లో చర్చి పాస్టర్లు తాము జీతాన్ని మత ప్రచారానికే ఉపయోగిస్తామని, కాబట్టి తమను టీడీఎస్ నుంచి మినహాయించాలని కోర్టుకు వెళ్లారు. అయితే, అది సాధ్యం కాదని, దేశంలో ఉద్యోగులం దరూ సమానమేనని పేర్కొంటూ వారి అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. అసలు విషయం ఇది అయితే, 1944 నుంచి కాంగ్రెస్ పార్టీ పాస్టర్లకు ఆదాయం పన్ను మినహాయించిందని ప్రచారం జరిగింది. ఇది నిజమేనని నమ్మి జనం కాంగ్రెస్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దాడి జరిపారు.

దశాబ్దాల నుంచి బీజేపీ అభిమానులు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారు. ఒక చిన్న రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్‌ను మినహాయిస్తే కాంగ్రెస్ ఇప్పుడు తెలంగాణ, కర్ణాటకలో మాత్రమే అధికారంలో ఉన్నది. ఈ లెక్కన దేశంలో 90 శాతం కాంగ్రెస్ ముక్త్ భారత్ నెరవేరినట్టే. మిగిలిన ఈ రెండు రాష్ట్రాల్లో అధికార పక్షానికి బీజేపీ నుంచి ఇప్పటివరకు పెద్దగా ఇబ్బందుల్లేవు. బీజేపీకి ప్రయోజనం ఉన్నంతవరకే ఈ అనుబంధం, సహకారం ఉంటుంది. కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యాన్ని బీజేపీ ఈ రెండు రాష్ట్రాల నుంచి ఎందుకు మినహాయిస్తుంది.

తన తప్పుడు ప్రచార శక్తితో బీజేపీ దేశమంతటా కాంగ్రెస్‌ను చావుదెబ్బ కొడితే బీఆర్ఎస్‌ను లక్ష్యం చేసుకొని కాంగ్రెస్ అదే తప్పుడు ప్రచారాన్ని నమ్ముకొన్నది. నిజానికి ఈ తప్పుడు ప్రచారంలో కూడా కాంగ్రెస్ సొంత తెలివి చూపలేక పోతున్నది. సోనియా గాంధీ ఇటలీ వెళ్లిపోతారని, రాహుల్ గాంధీ అమెరికాలో స్థిరపడతారని బీజేపీ చాలాకాలం క్రితమే ప్రచారం మొదలు పెట్టింది. కాంగ్రెస్ ఇప్పుడు దాన్ని కాపీ కొట్టి కేసీఆర్ అమెరికా వెళ్లిపోతారని ప్రచారం మొదలుపెట్టింది. సీఎం పదవిలో ఉన్నప్పుడే తన వ్యవసాయ క్షేత్రంపై కేసీఆర్ ఆసక్తి చూపారు. సొంత గ్రామాన్ని, వ్యవసాయ క్షేత్రాన్ని ప్రేమించేవారు వదిలి వెళ్లలేరు.

కాంగ్రెస్‌కు సుదీర్ఘకాలం పాలించిన అనుభవం ఉన్నది. హామీలను అమలుచేసి చూపిస్తాం. నిధులు ఎలా సమకూర్చుకోవాలో మాకు తెలుసు అని ఎన్నికలకు ముందు గంభీరంగా పలికిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలుచేయలేక సాకులు వెతుకుతున్నారు. ఒకవైపు హామీలు అమలు చేయలేక ప్రజల్లో చులకన అవుతున్నారు, మరోవైపు విషయ పరిజ్ఞానం లేక నవ్వుల పాలవుతున్నారు. దీంతో బీజేపీ తరహా దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ నమ్ముకొన్నది. మతం ఆధారంగా సాగిన, సాగుతున్న ఆ ప్రచారం బీజేపీకి బాగానే ఉపయోగపడింది. అయి తే, ఆ మార్గంలో కాంగ్రెస్ వెళ్లినా ప్రయోజనం ఉండ దు. బీజేపీ సిలబస్ వేరు, కాంగ్రెస్ సిలబస్ వేరు. ఇంకా నాలుగేండ్ల సమయం ఉన్నది. చిలిపి రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్రంపై దృష్టిపెడితే మంచిది.

కాలుష్యంపై కన్నేయని ఢిల్లీ నేతలు

అనిత సలుజా

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సంచలనాలు నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ, కాంగ్రెస్ మధ్య జరుగుతున్నాయి. అయితే పోటీ మాత్రం ఆప్, బీజేపీ మధ్యే. అయితే, ఆప్‌కు వెళ్లాల్సిన ఓట్లను మాత్రం కాంగ్రెస్ తప్పకుండా చీలుస్తుంది. దీనివల్ల లబ్ధి పొందేది బీజేపీనే. అయితే, గాలి ఏ పార్టీకి అనుకూలంగా లేకపోవడంతో ఢిల్లీ ఓటర్లు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

మరోవైపు ఎన్నికల సమరాంగణంలో ఉన్న అభ్యర్థులు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణలను ఢిల్లీ వాసులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆప్ గురించి చెప్పాలంటే ఈ ఎన్నికలు ఆ పార్టీకి చావో రేవో లాంటివి. దేశ రాజధాని ఢిల్లీ నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆప్ ఆ తర్వాత ఢిల్లీని తన కంచుకోటగా మార్చుకున్నది. అంతేకాదు, పంజాబ్‌కూ విస్తరించింది. గుజరాత్, గోవాలోనూ పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నది. సమీప భవిష్యత్తులో ప్రధాని పీఠాన్ని అధిష్ఠించాలని పగటి కలలు కంటున్న కేజ్రీవాల్‌కు ఇది సుదీర్ఘ ప్రయాణం.

ఆప్ 2013లో తమది సామాన్యుల పార్టీ అని ప్రకటించింది. స్వచ్ఛమైన పాలన అందిస్తామని, రాజకీయాల్లో ఆదర్శంగా నిలుస్తామని ప్రకటించి కాంగ్రెస్‌ను మట్టికరిపించింది. కేజ్రీవాల్ ఆహార్యం అత్యంత సామాన్య వ్యక్తిలా ఉండటంతో ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. అయితే, మెట్రోలో ప్రయాణించడం, మారుతి కారులో కార్యాలయానికి వెళ్లడం చూసి చాలామంది దీన్ని పొలిటికల్ స్టంట్‌గా కొట్టిపడేశారు. కేజ్రీవాల్ ఆ తర్వాత సీఎం నివాసానికి రూ.80 కోట్లు ఖర్చుచేసి శీష్‌మహల్‌లో నివసిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనికితోడు ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కేజ్రీవాల్, ఆయన క్యాబినెట్ సహచరులు సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా ఇతర నేతలు జైలుకు వెళ్లొచ్చారు. అయితే, ఆప్ ప్రకటించిన ఉచితాలు ఆ పార్టీకి కొంత ఫేవర్‌గా కనిపిస్తున్నాయి. విద్యుత్తు చార్జీలను తగ్గించడం, విద్యావ్యవస్థలో నాణ్యత, ఆనారోగ్య పీడితుల కోసం మొహల్లా క్లినిక్‌ల ఏర్పాటు వంటివి ఆప్‌పై ప్రజల ఆదరణకు కారణమయ్యాయి. గతంలో వీటిని విమర్శించినవారు ఇంచుమించు అలాంటి పథకాలే ప్రకటిస్తూ ఆప్‌ను ఆసుకరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, పెరుగుతున్న పన్నులపై మధ్యతరగతి ప్రజలు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఢిల్లీ వాసులు మౌలిక సదుపాయాలు, పక్కా రోడ్ల నిర్మాణం, స్వచ్ఛమైన గాలి, నీరు కోసం ఎదురుచూస్తున్నారు. అయితే, మూడు ప్రధాన పార్టీలు కూడా కనీస సౌకర్యాల గురించి ఆలోచించకుండా పేదలు, మహిళలు, వృద్ధులకు ఉచితాల విషయంలో పోటీ పడుతున్నాయి.

> **ఢిల్లీ నాయకులు గత ఐదేండ్లుగా ఒకరిపై ఒకరు బురదజల్లుకోవడంలో బిజీగా ఉన్నారు తప్పితే ఢిల్లీని కమ్మేస్తున్న కాలుష్యానికి పరిష్కారం వెతికేందుకు ఎవరూ ముందుకు రాలేదు. గాలిలో నాణ్యత ఏకంగా 400 పీఎంకు పడిపోయింది. రాజధాని ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించలేకపోతున్నందుకు ఆప్, బీజేపీలను నిందించడం మాని కలుషిత గాలిని శుభ్రం చేసే చర్యలు చేపట్టాలి. ప్రత్యర్థిపై వాదనలో విజయం సాధించడం కంటే సానుకూల దృక్పథం ప్రజలను ఆకట్టుకుంటుంది.**

'పార్టీ విత్ ఏ డిఫరెన్స్' అనే ట్యాగ్ ఇప్పుడు బీజేపీకి సంబంధించి నది కాదు. మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఆప్ ప్రభుత్వానికి పనిచేసే స్వేచ్ఛ ఇవ్వడం లేదన్నది బహిరంగ రహస్యం. లెఫ్టినెంట్ గవర్నర్‌కు పూర్తి అధికారాలు ఇచ్చేలా చట్టాన్ని తీసుకురావడం, రాష్ట్ర ప్రభుత్వం తమ సొంత అధికారులను కూడా నియమించుకోకుండా గవర్నర్ చేతు లు కట్టేయడంతో న్యాయం కోసం ప్రతిసారి ప్రభుత్వం కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తున్నది. ప్రస్తుతం మూడు పార్టీలు ఒకేలా కనిపిస్తున్నాయి. మూడూ 'బ్లేమ్ గేమ్'నే ఎంచుకున్నాయి. ఇవి కొంతమంది ఓటర్లను 'నోటా'ను ఎంచుకునేలా ప్రోత్సహిస్తున్నాయి.

బీజేపీ ఇప్పటివరకు తమ సీఎం అభ్యర్థి ఎవరో చెప్పలేకపోతున్నది. ఇక, ఆప్ ఇమేజ్ బాగా దెబ్బతిన్నది. ఇక, కాంగ్రెస్ పోటీ చేయాలి కాబట్టి చేస్తున్నది. కాంగ్రెస్ అనుసరిస్తున్న అలసత్వ వైఖరి ఓటర్లను ఆకట్టుకునేలా లేదు. తమ గెలుపుపై తమకే నమ్మకం లేనప్పుడు ఇక వారు ఓటర్లను ఎలా ఒప్పిస్తారు. హై కమాండ్ నుంచి సరైన మద్దతు లభించకపోవడంతో పార్టీ సీనియర్లు ఎవరికి వారే సొంతంగా పోటీ చేస్తున్నారు.

రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ జరుగుతున్నది. కల్కాజీ నుంచి ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా బరిలో ఉన్నారు. న్యూఢిల్లీ నుంచి కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ వర్మ బరిలో ఉన్నారు. ఇక్కడ బరిలో ఉన్న మూడు పార్టీల అభ్యర్థులు బలమైన నేతలే. ఈసారి కాంగ్రెస్ తన ఓట్ల శాతాన్ని మెరుగుపరుచుకునే అవకాశం కనిపిస్తున్నప్పటికీ అది గెలుపు రూపంలోకి ఎంతవరకు మారుతుందన్నది చూడాలి. ఆప్‌లోని పెద్ద నాయకులందరూ తమ సొంత ఎన్నికల పోరులో బిజీగా ఉండగా, కేంద్రంలోని బీజేపీ మాత్రం తమ 70 మంది అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడుస్తున్నది. యూపీ, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, హర్యానా ముఖ్యమంత్రులతో పాటు ప్రధాని మోదీ కేజ్రీవాల్, ఆయన బృందానికి ఏ చిన్న అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆప్ నేతలు అవినీతి ఆరోపణల్లో చిక్కుకోవడంతో ఢిల్లీ వాసులు ఆ పార్టీ నేతలను తిరస్కరిస్తారా? అంటే కాదనే చెప్పాలి. ఎందుకంటే, అవినీతి అక్రమాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు ఢిల్లీ వాసులను ఆకట్టుకునే అంశాలు కాదు. ఈ మూడు ప్రధాన పార్టీల్లో ఏ ఒక్కటీ కల్పిస్తామని హామీ ఇవ్వని కనీస సౌకర్యాలను ఢిల్లీ ప్రజలు కోరుతున్నారు. అయితే, ఫలితం ఎలా ఉండబోతున్నదని అంచనా వేయడం మాత్రం చాలా కష్టం.

(వ్యాసకర్త: ఢిల్లీలో సీనియర్ జర్నలిస్ట్)

పౌరసత్వం ముసుగులో మాయాజాలం

ఆర్‌సీ కుమార్

జన్మతః పౌరసత్వం అనేది అమెరికాలో రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కు. ఇప్పడా హక్కును రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాలు జారీచేశారు. అమెరికాలో స్థిరపడి నాణ్యమైన జీవితాన్ని గడపాలని భావించే విద్యార్థులు, యువత ఉత్సాహాన్ని ఇది నీరుగారుస్తుందని అనడంలో సందేహం లేదు. అంతేకాదు, పౌరసత్వం పొంది పెరిగిన పిల్లల ద్వారా భవిష్యత్తులో తల్లిదండ్రులు కూడా పౌరసత్వాన్ని పొందవచ్చునన్న ఆశను ఇది అడుగంటిపోయేలా చేస్తుంది.

జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ట్రంప్ తీసుకున్న ఈ చర్య సార్వత్రిక మానవతా మూల సూత్రాలకు విరుద్ధమని విదేశీయులు భావిస్తుంటే, అమెరికా జాతీయ మూల సూత్రాలకు అనుకూలమని ప్రాంతీయ అమెరికన్లు సంబురపడుతున్నారు. సొంత దేశ ప్రయోజనాలను కాపాడుకునే చర్యలను ఇతర దేశస్థులు అమానవీయ చర్యలుగా భావిస్తుండటం స్థానిక అమెరికన్లకు మింగుడుపడటం లేదు. ఆ చర్యలు ఆ దేశంలో చట్టసభలకు, న్యాయ పరీక్షకు నిలుస్తాయా? లేదా? అన్నది వేరే విషయం. అయితే, రాజ్యాంగంలోని 14వ సవరణను రద్దుచేసే హక్కు అధ్యక్షుడికి లేదనే వాదన కూడా గట్టిగా వినిపిస్తున్నది.

ఎప్పుడో వందేండ్ల కిందటి అప్పటి అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాటు చేసుకున్న పౌరసత్వ చట్టాన్ని ఇప్పటికీ అమలుచేస్తూ, అక్రమ వలసదారులను అక్కున చేర్చుకుంటూ, నానాటికీ పెరిగిపోతున్న వారి సంతతికి తోడ్పడే విలువైన అగ్రరాజ్య పౌరసత్వాన్ని అప్పనంగా ఇచ్చేస్తూ పోతే తమ పరిస్థితి ఏమిటనే ప్రశ్నను స్థానికులు లేవనెత్తుతున్నారు. అమెరికన్లలో నిరుద్యోగులు, ఆవాసం లేని వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. 2018, 2019 సంవత్సరాల్లో అప్పుడు అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ అమెరికన్ల అవకాశాలను దెబ్బతీసే జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేయాలన్న వాదనను తెరపైకి తెచ్చారు. కారణాంతరాల వల్ల దానిని అమలుచేసే అవకాశం రాలేదు.

అమెరికా కోసం అర్రులు చాచడం గత మూడు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్నది. 1990వ దశకంలో ఐటీ విప్లవం ఊపందుకోవడంతో సాంకేతిక నిపుణుల కొరత నెలకొన్నది. దీంతో భారతీయులకు అమెరికాలో ఉద్యోగ అవకాశాలు మరింతగా పెరిగాయి. భారీ సంఖ్యలో మేధోవలసలు మొదలయ్యాయి. కానీ అక్కడి జీవన ప్రమాణాలు, విలాసవంతమైన జీవన విధానానికి అలవాటుపడ్డ వలస జీవులు పౌరసత్వాన్ని పొందేవరకు అక్కడే స్థిరపడిపోయారు. చట్టపరంగా పౌరసత్వం పొంది అక్కడి చట్టాలను గౌరవిస్తూ అక్కడివారితో కలిసి మెలసి హుందాగా అమెరికన్ పౌరులుగా జీవనాన్ని కొనసాగిస్తున్నారు. విదేశీ వ్యామోహంలో పడి కొట్టుకుపోవడమే కాకుండా అమెరికా సంపద వృద్ధి చేయడంలో మన పాత్ర గురించి గొప్పలు చెప్పుకోవడం

మనకు పరిపాటి. నిజానికి వారి అవసరాలకు అనుగుణంగా మన శక్తి సామర్థ్యాలను అమెరికా వాడుకుంటే, దానికి ప్రతిగా మనవారు కూడా అధిక వేతనాలతో డాలర్ల రూపంలో అక్కడే వ్యక్తిగత సంపద సృష్టించుకొని, విలాస జీవితాన్ని గడుపుతూ లాభపడ్డారు. ఇందులో త్యాగనిరతి ఏ మాత్రం లేదు.

అమెరికా కార్పొరేట్ చరిత్రలో భారత జాతి ఖ్యాతిని ఇనుమడింపజేసిన సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, శంతను నారాయణ్ లాంటి ఎందరో హేమాహేమీల అసామాన్య ప్రతిభ మాత్రం మరువలేనిది. పౌరసత్వానికి సంబంధించిన కార్యనిర్వాహక ఆదేశం ఉద్దేశం సరైన పత్రాలతో చట్టపరంగా ఇమిగ్రేషన్ పొందిన వారిని ఇబ్బంది పెట్టడం కాదని, అక్రమ వలసదారులపై వేటు వేసే ప్రధాన ఆయుధంగా ట్రంప్ దీన్ని వాడుకుంటారని శ్వేతసౌధం వివరణ ఇచ్చింది. ఆ మాటకొస్తే జో బైడెన్ ప్రభుత్వం 1,500 మంది అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించి భారతదేశానికి తిప్పి పంపింది. ఆ సమయంలోనూ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా బహిష్కరించిన మొత్తం అక్రమ వలసదారుల సంఖ్య 2,70,000.

> **ఇప్పటికీ సరైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న కోటిన్నర మందిలో భారతీయుల సంఖ్య ఏడున్నర లక్షలుగా చెప్పునారు. మెక్సికో, కెనడా, లాటిన్ అమెరికా, సాల్వెడార్, ఇండియా దేశాల అక్రమ వలసదారులే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వీసా దరఖాస్తుల ప్రక్రియను మరింత కట్టడి చేసే నిర్ణయాన్ని కూడా ట్రంప్ తీసుకున్నారు.**

'బర్త్ టూరిజం' ముసుగులో మరో మాయాజాలం కొనసాగుతున్నది. తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించాలన్న ఉద్దేశంతో ఉన్నత స్థితిలో ఉన్న కొందరు భారతీయ మహిళలు (ఇతర దేశస్థులు కూడా) డెలివరీ సమయానికి అమెరికా సందర్శనకు బయలుదేరుతారు. ప్రసవానంతరం తిరిగి స్వదేశానికి వెళ్లిపోతారు. అక్కడ పుట్టిన పిల్లలకు యథావిధిగా పౌరసత్వం లభిస్తుందని ఈ నాటకానికి తెరతీశారు. దీనినే 'బర్త్ టూరిజం' గా పేర్కొంటారు. ఇకపై దీనికి బ్రేక్ పడనుంది.

ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 30 దేశాలు జన్మతః పౌరసత్వ హక్కు కల్పించినప్పటికీ తర్వాత కాలంలో ఐర్లాండ్, న్యూజిలాండ్ వంటి కొన్ని దేశాలు వాటిని రద్దు చేసుకున్నాయి. విమానాల్లో ప్రయాణించే గర్భిణులు ప్రసవిస్తే అటువంటి శిశువుకి 21 ఏండ్లు నిండే వరకు ఆ సంస్థకు చెందిన విమానాల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ఉన్నది. అటువంటి పిల్లలకు కొన్ని విమానయాన సంస్థలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాయి. ఆకాశంలో పుట్టిన ఈ పిల్లలకు గగనతల పౌరసత్వ హక్కును కల్పించాలా? లేదా, జన్మించిన స్థల పరిధి ఏ దేశానికి సంబంధించినది అయితే ఆ దేశానికి సంబంధించిన పౌరసత్వం కల్పించాలా అనే విషయంపై ఆయా దేశాలు నిర్ణయం తీసుకుంటాయి.

అమెరికా భూభాగం మీదుగా ప్రయాణించే విమానంలో పుట్టిన పిల్లవాడు అమెరికా పౌరసత్వాన్ని పొందుతాడు. ప్రస్తుతానికైతే ఇండియా సహా అన్ని దేశాల్లో విమానయాన సంస్థలు ఆరోనెల నుంచే గర్భిణులను విమాన ప్రయాణానికి అనుమతించడానికి సుముఖత చూపడం లేదు.

(వ్యాసకర్త: సామాజిక కార్యకర్త)


మళ్లీ ఉత్తచేతులతో పంపిస్తే
బాగుండదని
ఇదిచ్చి పంపించారే!
రిక్తహస్తాలతో వెనక్కిపోవద్దు
నిండుల తేమి..
చేతులెత్తేసిన
ప్రభుత్వం